ప్రజాశక్తి
ఆదివారం 1 సెప్టెంబర్ 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

భారీ వర్షం



బాపట్ల జిల్లా నగరంలో నీట మునిగిన వరి పొలాలు



ఒంగోలులో కూరగాయల మార్కెట్‌లో కి చేరిన వర్షపు నీరు

- ఒంగోలులో పొంగిన డ్రైనేజీలు
- అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం
- వర్షంలోనే పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి
- బాపట్ల జిల్లాలో నీట మునిగిన వరి పొలాలు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా జిల్లాలో శుక్రవారం నుంచి వర్షాలు కురుస్తున్నాయి. శనివారం భారీ వర్షంగా మారింది. దీంతో లోతట్టుప్రాంతాల్లో ముంపు సమస్యలు ఏర్పడ్డాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లా అంతటా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. పంటలకు ఇప్పటికిప్పుడు పెద్దగా నష్టం ఏమీలేదు. ఖరీఫ్ పంటలకు ఎంతో కొంత మేలు చేస్తోంది. బాపట్ల జిల్లాలో వరిపొలాలు అక్కడక్కడా నీటమునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. ఇక వర్షాల్లోనే మంత్రి డొలావీరాంజనేయస్వామి పెదారవీడు మండలంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు

▶ 2లో

వరదనీటిలో చిక్కుకున్న 150 మంది భక్తులు

ప్రజాశక్తి- రాచర్ల

రాచర్ల మండలం జేసీ చెరువు గ్రామసమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలోని నెమలిగుండ్ల రంగ నాయక స్వామి ఆలయానికి దర్శనం కోసం వచ్చిన దాదాపు 150 మంది భక్తులు వరదల్లో చిక్కుకున్నారు. శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న ఎడతెరపి లేని వర్షానికి నల్లమల అటవీ ఎగువ ప్రాంతం నుంచి భారీగా వస్తున్న వరద నీటితో నెమలిగుండ్ల రంగనాయకస్వామి గుండం నిండి పొంగి పొర్లుతుంది. దీంతో గుండ్లకమ్మ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలో రంగనాయక స్వామి దేవస్థానానికి స్వామి దర్శనం కోసం వచ్చిన దాదాపు 150 మంది భక్తులు గుండ్లకమ్మ వాగు ఉధృతికి ఇవతలి వైపు రాలేక బిక్కుబిక్కు మంటూ ఆలయం వద్దే ఉండి పోయారు. సమాచారం అందుకున్న రాచర్ల ఎస్ కోటేశ్వరరావు తన సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని దాదాపు రెండు గంటల పాటు సహాయక చర్యలు చేపట్టి ట్రాక్టర్ ద్వారా భక్తులను ఇవతలి వైపుకు తీసుకొచ్చారు. అనంతరం వారి గమ్యస్థానాలకు పంపారు. దీంతో భక్తులు, ఆలయ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సహాయక చర్యల్లో డిప్యూటీ తహశీల్దార్ భారతీ భాయి, సిఐ రామకోటయ్య, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు : మంత్రి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్ : భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి ఆదేశించారు. భారీ వర్షాలపై కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్పి దామోదర్, రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల, సంక్షేమ వసతి గహాల ఉన్నతాధికారులతో మంత్రి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి డిబివి స్వామి మాట్లాడుతూ భారీ వర్షాలతో జిల్లాలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని ఆదేశించారు.

కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలూ పనిచేసేలా ప్రత్యేక కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్లు సంయుక్త కలెక్టర్ ఆర్. గోపాల కృష్ణ తెలిపారు. వర్షాలతో ఇబ్బందులు వస్తే 1077 టోల్ ఫ్రీ నెంబరుకు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.



కారంచేడులో పొంగిపొర్లుతున్న పిల్లవాగు



ఒంగోలు భాగ్య నగర్‌లో రహదారిపైకి చేరిన వర్షపునీరు



వర్షంలోనే పింఛన్లు అందజేస్తున్న మంత్రి స్వామి



రాచర్లలో పొంగి ప్రవహిస్తున్న గుండ్లకమ్మ

జ్వరం.. జ్వరం.. జనాల్లో భయం..

- రోజురోజుకు పెరుగుతున్న రోగులు
- కిలకిటలాడుతున్న ఆసుపత్రులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం ప్రాంతంలో జ్వర పీడితులు రోజు రోజుకూ పెరుగుతున్నారు. రోజుల తరబడి జ్వరం తగ్గకపోవడంతో మంచాలకే పరిమితమవుతున్నారు. వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి భారీగా ఖర్చు చేస్తున్నారు. గ్రామాల్లో వైద్యం అందక యర్రగొండపాలెం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు, ప్రైవేట్ వైద్యశాలలకు క్యూ కడుతున్నారు. కొందరు గుంటూరు, ఒంగోలు, విజయవాడ, నరసరావుపేట తదితర ప్రాంతాలకు వెళ్తున్నారు. వారం రోజులుగా యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల్లో టైఫాయిడ్, మలేరియా, వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయి. ప్రతిరోజూ యర్రగొండ పాలెం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు జ్వరాలతో వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. జ్వరాలతో రోజుకు 50 నుంచి 100 మంది రోగులు ఆసుపత్రికి వస్తున్నారు. వారిలో కొందరిని ఇన్‌పేషెంట్లుగా చేర్చుకొని చికిత్స అందిస్తున్నారు, డెంగీ లక్షణాలు కనిపించిన వారు మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ వెళుతున్నారు.

యర్రగొండపాలెం మండల పరిధిలోని మురారిపల్లి, యర్రగొండపాలెం, కొలుకుల, సర్వాయిపాలెం, త్రిపురాంతకం మండలంలోని రామసముద్రం, పుల్లలచెరువు మండల పరిధి లోని చిన్న పిఆర్‌సి తాండా, పెద్ద

▶ 2లో



వైద్యశాలలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

బాలినేని అవినీతిపై సమగ్ర విచారణ

ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి అవినీతిపై సమగ్ర విచారణ చేయిస్తామని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు తెలిపారు. బాలినేని శ్రీనివాసరెడ్డి మీపై ఆర్‌బిఐకి ఫిర్యాదు చేస్తారంటా కదా అని పాత్రికేయులు ప్రశ్నించగా దామచర్ల స్పందించారు. బాలినేనికి వయస్సు అయిపోయిందని, ఫ్రస్ట్రేషన్‌లో ఏమీ మాట్లాడుతున్నాడో అర్థం కావట్లేదన్నారు. హైదరాబాద్ ఇంట్లో కూర్చోవాలని, రూ.2 కోట్లకు పరువు నష్టం దావా అంటూ కోర్టు ద్వారా నోటీసులు పంపితే ఏమీ కాదన్నారు. ఒంగోలు వచ్చినప్పుడు బాలినేని కోపంతో ఊగిపోతారని తెలిపారు. తాము ఏదైనా అచితూచి, గౌరవించి మాట్లాడతామని తెలిపారు. బాలినేనిలా అసభ్య పదజాలంతో మాట్లాడమని గుర్తు చేశారు. బాలినేని అవినీతిపై జనసేన పార్టీ నాయకులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఒంగోలు నగరంలో నకిలీ పత్రాలు సృష్టించి పొలాలు, భూములు ఆక్రమించారని, 200పైగా కేసులు నమోదైతే స్పెషల్ ఇన్విస్టిగేషన్ టీమ్(సిట్) వేసి డమ్మీలను అరెస్టు చేయించినట్లు తెలిపారు. దోషులను అరెస్టు చేయలేదన్నారు. తమ ఆస్తులు రాలేదని పోలీసుల చుట్టూ జనాలు తిరుగుతున్నారని, ఈ విషయమై డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఆ పార్టీ నేతలకు ఆదేశాలు ఇస్తున్నారన్నారు. బాలినేని ఉలిక్కిపడి తనపై సిఐడి, సిబిఐ విచారణ వేయాలని కోరుతున్నారని, ఏమీ చేయాలో ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుందన్నారు. జనసేన పార్టీలోకి వెళుతున్నానని బాలినేని కొందరికి ఫోన్లు చేస్తున్నారని, ఆయన జనసేనలోకి, బిజెపిలోకి వెళ్ళినా అవినీతిపై పోరాటాన్ని కొనసాగిస్తామని ఎమ్మెల్యే దామచర్ల స్పష్టం చేశారు.

జ్వరం..జ్వరం.. జనాల్లో భయం..

భారీ వర్షం

(మొదటిపేజీ తరువాయి)

ముందుగానే పింఛన్ల పంపిణీ మొదలైంది. ఫింఛన్ల పంపిణీకి వర్షం ఆటంకంగానే మారింది. ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల కూడా వర్షంలోనే పించన్లు పంపిణీ చేశారు. నియోజకవర్గాల్లో పాలకపక్ష ఎమ్మెల్యేలు లాంఛనంగా పేదలకు పింఛన్లు పంపిణీ చేశారు. ఇక వర్షాలకు రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తతను ప్రకటించింది. సిఎం చంద్రబాబు వర్షాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులను ఆదేశించారు.శనివారం పాఠశాలలకు సెలవు ప్రకటించారు. మ్యాన్‌హోల్స్, కరెంటు తీగెల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పొంగే వాగులు, వంకలు దగ్గర హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక కొద్దిపాటి వర్షాలకే జలమయమయ్యే ఒంగోలులో పలుచోట్ల డ్రైనేజీలు పొంగాయి. కాలనీల్లోకి నీళ్లు చేరాయి. కర్నూలు రోడ్డు పూర్తిగా వరదనీటితో నిండిపోయింది. రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎమ్మెల్యే జనార్ధన్ మున్సిపల్ అధికారులతో కలిసి పట్టణంలోని ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. పొంగుతున్న డ్రైనేజీలను పరిశీలించారు. సహాయక చర్యలు పర్యవేక్షించారు. జిల్లాలో నమోదైన వర్షపాత వివరాలను పరిశీలిస్తే పశ్చిమప్రాంతంలోనే శుక్రవారం ఎక్కువగా వర్షం కురిసింది. శనివారం జిల్లా అంతటా భారీ వర్షాలు కురిశాయి. దోర్నాలలో 42.8 మిల్లీమీటర్లు, చీమకుర్తిలో 41.4మిమి, మార్కాపురంలో 40.4 మిమి, మద్దిపాడులో 40.2 మిమి, ఒంగోలులో 40.2 మిమి, ఒంగోలులో 36.6 మిమి, పెదారవీడులో 36.6 మిమి, త్రిపురాంతకంలో 36.6 మిమి, దర్శిలో 36.2 మిమి, నాగులుప్పలపాడులో 34.2 మిమి, కురిచేడులో 32 మిమి, వైపాలెంలో 32 మిమి, గిద్దలూరులో 30.8 మిమి, ముండ్లమూరులో 30.4 మిమి, కొనకొనమిట్లలో 30.4 మిమి,దొనకొండలో 30 మిమి, తాళ్లూరు, పొదిలిలో 29.2 మిమి, పుల్లలచెరువులో 26 మిమి వర్షం కురిసింది. మిగతా మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. టంగుటూరులో 8.4మిమి, మర్రిపూడి, అర్ధవీడు మండలాల్లో 6.2 మిమి వర్షం కురిసింది.

నీట మునిగిన వరి పొలాలు

రేపల్లె: అల్పపీడనం ప్రభావంతో కురిసిన వర్షాలకు మండల పరిధిలోని పలు గ్రామంలో వరి పైరు నీటి మునిగింది. వర్షాలు, కాలువలకు నీరు ఒకే సమయంలో రావడంతో వరి పొలాలు ముంపు బారీన పడ్డాయి. వర్షాలకు డ్రెయిన్లు ఎదురు తన్నడంతో వరద నీరు బయటికి వెళ్లే మార్గం లేక చేలల్లో నీరు నిలిచిపోయింది. దీంతో వరిపైరు నీటిలో కుళ్లిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పొలాల్లో నీరు పెరగడంతో పెద్ద ఎత్తున నాట్లు దెబ్బతినే పరిస్థితి నెలకొంది. వర్షం ఇలాగే కొనసాగితే పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందు తున్నారు. మండలంలో ఇప్పటికే 90 శాతం నాట్లు పూర్తయ్యాయి. ఎకరాకు రూ.15 వేలకుపైగా రైతులు పెట్టుబడి పెట్టారు. అదేవిధంగా నగరం, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లో పరిధిలోని గ్రామాల్లో వరినాట్లు నీట మునిగాయి. ఇదే పరిస్థితి మరో రెండు రోజులు కొనసాగితే వరి మొక్కలు కుళ్లి పోయే ప్రమాదం ఉంటుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

(మొదటిపేజీ తరువాయి)

పిఆర్‌సి తాండా తదితర గ్రామాల్లో జ్వర బాధితులు అధికంగా ఉన్నారు. వైరల్ జ్వరాలు ఎక్కువగా వ్యాపిస్తున్నాయి. ముందుగా ఒళ్లు నొప్పులు వచ్చి ఆ తర్వాత జ్వరాలతో ఇంటిల్లపాదీ ఇబ్బంది పడుతున్నారు. తొలుత గ్రామాల్లో చికిత్స పొందుతున్నారు. జ్వరంతో పాటు నీరసం తగ్గడం లేదు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేట్ వైద్యశాలలకు వెళ్తున్నారు. దీంతో సకాలంలో వైద్యం అందక తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు.

చికిత్స పొందుతున్న జ్వర పీడితులు..

కొలుకుల గ్రామానికి చెందిన కర్రె వెంకటేశ్వర్లు, మురారిపల్లి గ్రామానికి చెందిన కుర్రా గాలెయ్య, యర్రగొండపాలెంకు చెందిన చప్పిడి కోటేశ్వరి జ్వరాలతో బాధపడుతూ యర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చేశారు. అదేవిధంగా యర్రగొండపాలెంకు చెందిన మూడు సంవత్సరాల కాకర్ల కౌసిక్, సర్వాయిపాలెంకు చెందిన ఎనిమిది సంవత్సరాల గొళ్లపల్లి సిరి, పుల్లలచెరువు మండలం పెద్ద పిఆర్‌సికి చెందిన నాలుగు సంవత్సరాల రామావత్ దీపికా బాయ్, త్రిపురాంతకం మడలం రామసముద్రం గ్రామానికి చెందిన ఐదు సంవత్సరాల జినుకూటి ఆయూష్ జ్వరంతో బాధ పడుతూ చికిత్స పొందుతున్నారు.

జ్వర పీడితులు పెరుగుతున్నారు: డాక్టర్ దేవర యదిద్యా, ప్రభుత్వ ఏరియా వైద్యశాల, సూపరింటెండెంట్, వైపాలెం



వారం రోజులుగా జ్వరాలతో ఏరియా ఆసుపత్రికి వచ్చే వారి సంఖ్య పెరిగింది. వారికి సకాలంలో చికిత్స అందిస్తున్నాం. రోజుకు జ్వరపీడితులే 50 నుంచి 100 మంది వరకూ వస్తున్నారు. మలేరియా, టైఫాయిడ్ లక్షణాలున్న రోగులు వస్తున్నారు. మెరుగైన చికిత్స అందిస్తున్నాం.

జోరువాన..

- పొంగిన జంపలేరు వాగు - వీధులన్నీ జలమయం - మునిగిపోయిన పంటలు



ఉధృతంగా ప్రవహిస్తున్న జంపలేరు

తర్లుపాడు: అల్పపీడనం ప్రభావంతో శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తోంది. దీంతో తర్లుపాడులోని ప్రధాన వీధులు, కాలనీలు జలమయమయ్యాయి. సైడ్ కాలువలు మూసుకుపోవడంతో మరుగు నీరంతా రోడ్లపై ప్రవహిస్తుండడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన సెంటర్లలో దుకాణాలు ముందు నీరు నిలబడిపోవడంతో వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. ఎంపీడీవో, తహశీల్దార్ కార్యాలయాలకు వెళ్లే ప్రధాన ద్వారం వద్ద వర్షం నీరు నిలిచి చిన్నపాటి వాగును తలపిస్తోంది.

కంభం రూరల్: శుక్రవారం రాత్రి నుండి కురుస్తున్న వర్షాలకు జంపలేరు వాగు ఉప్పొంగింది. దీంతో కంభం చెరువుకు ఉధృతంగా నీళ్లు వస్తున్నాయి. రాత్రి నుండే కుండపోతగా కురుస్తున్న వర్షాలకు స్థానిక కాపవీధిలోని ఓ మట్టి మిద్దె ముందు భాగం కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. పదునైన వర్షాలు కురుస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాగులుప్పలపాడు: ఎడతెరిపి లేని వర్షాలకు నువ్వుల పంట మునిగి పోయింది. శనివారం రోజంతా కుండ పోతగా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో ఓ వైపు రైతుల్లో హర్షం వ్యక్తం చేస్తుండగా మరో వైపు కొందరు రైతులు నష్ట పోయారు. నువ్వుల పంట కొంతభాగం పొలాల్లో కుచ్చెళ్ళు ఉన్నాయి. రెండు మూడురోజుల్లో గింజలు చేరుతాయని అనుకున్న సమయంలో ఈవర్షంతో నూవ్వుల కుచ్చెళ్ళు పూర్తిగా తడిచి పోయాయి. దీంతో గింజలు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మద్దిపాడు: వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు చర్యలలో భాగంగా చప్టాల వద్ద పోలీస్ పహారా ఏర్పాటు చేసినట్లు ఎస్సై శివరామయ్య అన్నారు. మండల పరిధిలోని పెద్దకొత్తపల్లి వెళ్లే మార్గంలో ఉన్న నేల చప్టాను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎగువ నుంచి నీరు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా గ్రోత్ సెంటర్ నుండి నాగులుప్పలపాడు వెళ్లే మార్గంలో ఉన్న నేల చప్టా వద్ద కూడా తమ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ముందస్తుగా ఆయా గ్రామాలలోని ప్రజలను అప్రమత్తం చేశామని తెలిపారు.



తర్లుపాడులో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు



పెద్దకొత్తపల్లి వద్ద చప్టాను పరిశీలిస్తున్న ఎస్ఐ శివరామయ్య



నాగులుప్పలపాడులో తడిచిన నువ్వుల కుచ్చెళ్లు

అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా

కొత్తపట్నంలో పునరావాస కేంద్రాల పరిశీలన



కొత్తపట్నంలోని పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి- కొత్తపట్నం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. శనివారం కొత్తపట్నం పల్లెపాలెం, గుండమాల గ్రామాలలోని తుఫాన్ సెంటర్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు సూచనలు ఇస్తూ గత రెండు రోజులుగా జిల్లాలో వర్షాలు పడుతున్నాయని లోతట్టు ప్రాంతాల ప్రజలను గుర్తించి తుఫాన్ షెల్టర్లు, పునరా వాస కేంద్రాలకు తరలించాలన్నారు. విద్యుత్ సరఫరా, తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి నిత్యం పరిస్థితిని గమనిస్తూ ఎలాంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. పునరావాస కేంద్రాల పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కలెక్టర్ వెంట ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి సుబ్బారెడ్డి, తహశీల్దార్ పి.మధుసూదన్ రావు, ఎంపీడీవో పి.సుజాత, ఈఓఆర్డీ బాల చెన్నయ్య, పంచాయతీ కార్యదర్శులు మణిదీప్, లావణ్య, తదితరులు ఉన్నారు.

శింగరాయకొండ: తుఫాను ప్రభావం కారణంగా సముద్ర తీర ప్రాంతంలోని అధికారులు అప్రమత్తంగా ఉండాలని కొండపి నియోజకవర్గం ప్రత్యేక అధికారి, విజిలెన్స్ అండ్ సివిల్ సప్లయిస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏ.కుమార్ అన్నారు. శనివారం ఆయన శింగరాయకొండ మండలంలోని సముద్ర తీర ప్రాంత గ్రామాలైన పాకల, ఉళ్ళపాలెం గ్రామాల్లో పర్యటించారు. తుఫాను షెల్టర్‌లను పరిశీలించారు. షెల్టర్లను శుభ్రపరిచి సిద్ధంగా ఉంచాలన్నారు. తాగునీరు, విద్యుత్ సమస్యలు లేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. సచివాలయంలోని అన్ని శాఖల అధికారులు తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వీరి వెంట తహశీల్దార్ టి.రవి, ఎంపిడిఓ నరసింహమూర్తి, ఆర్ఐ ప్రవీణ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సగిలేరు వాగును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకట దాసు

గిద్దలూరు: నగర పంచాయతీ పరిధిలోని లోతట్టు ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ వెంకట దాసు శనివారం పరిశీలించారు. కుండపోత వర్షాల నేపథ్యంలో సగిలేరు పరీవాహక ప్రాంతాలలో ఆయన పర్యటించించి అక్కడి స్థానికులతో ఆయన మాట్లాడి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా సగిలేరు సమీప ప్రాంతాలైన శ్రీనివాస థియేటర్ ఏరియా, సత్యనారాయణ నగర్ ఇంకా పలు లోతట్టు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఆయన సిబ్బందికి సూచించారు. కాలువల్లోని వ్యర్థాలను రోడ్లపై ఉన్న చెత్త దిబ్బలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. ఆయన వెంట నగర పంచాయతీ అధికారులు ఉన్నారు.

రాచర్ల: రాచర్ల తహసీల్దార్ కార్యాలయంలో తుఫాన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ తహశీల్దార్ భారతీ బాయ్ తెలిపారు. తుఫాను కారణంగా భారీ వర్షాలు, వేగవంతమైన గాలులు వీచే ప్రమాదం ఉందని, మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పాత మిద్దెలు, పాతకట్టడాల్లో నివాసం ఉంటున్న ప్రజలు తగుజాగ్రత్తలు వహించాలని, వాగులు వంకలు పొంగిపోర్లుతున్న సమయంలో దాటే ప్రయత్నం చేయరాదన్నారు. తుఫాన్ సందర్భంగా గ్రామ రెవిన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలియజేశారు. తుఫాను వల్ల సమస్యలు ఎదురైతే రాచర్ల కంట్రోల్ రూమ్ చరవాణి నెం. 9398818683 లో సంప్రదించాలని డీటీ సూచించారు.

యర్రగొండపాలెం: తుఫాను కారణంగా భారీ వర్షాలు, వేగవంతమైన గాలులు వీచే ప్రమాదం ఉందని యర్రగొండపాలెం తహశీల్దార్ ఎం.హరిబాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తుఫాన్ కారణంగా యర్రగొండపాలెం మండలంలోని ప్రజలమంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. పాత మిద్దెలు, పాడుబడిన కట్టడాలలో నివసించే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నందున వాటిని దాటే ప్రయత్నం చేయరాదన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులు కూడా 24 గంటలూ గ్రామాల్లో అందుబాటులో ఉంటారని చెప్పారు. మండల కేంద్రంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తుఫాను వల్ల ఎలాంటి ఇబ్బందులు కలిగినా 9398818629 సెల్ నెంబర్‌లో తెలియజేయాలన్నారు.

యర్రగొండపాలెం పట్టంలోని వేగినాటి కోటయ్య వీధి, పిడిసిసి బ్యాంక్ వీధులలో కురిసిన వర్షానికి రోడ్లపై నీరు నిలిచి ఉండడంతో శనివారం పంచాయితీ కార్యదర్శి ఈదుల రాజశేఖర్‌రెడ్డి ఆ రెండు వీధులలో పర్యటించి పరిశీలించారు. వర్షపు నీరు నిలువ ఉండకుండా తగిన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పొదిలి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన పొదిలిలోని దర్శి రోడ్డులో పెట్రోలు బంక్ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆముదాలపల్లి గ్రామానికి చెందిన పూసలపాటి ఇజ్రాయిల్ (28) తన బైక్‌పై పొదిలి నుంచి దర్శి వెళుతుండగా ఎదురుగా వస్తున్న బొలారో వాహనం పరస్పరం ఢీకొన్నాయి. బైక్‌పై ప్రయాణిస్తున్న ఇజ్రాయిల్ అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పొదిలి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గుర్తు తెలియని వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలోని చిన్నారుట్లలో శనివారం జరిగింది. శుక్రవారం సాయంత్రం చిన్నారుట్ల గూడెంలోని ఓ ఇంటిలో అన్నం అడిగి పెట్టించుకొని తిని అక్కడే పడుకుంది. శనివారం ఉదయం మృతి చెందింది. తీవ్రమైన చలితోనే వృద్ధురాలు మృతి చెంది ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. వృద్ధురాలి వయసు 75 సంవత్సరాలు ఉండవచ్చని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు యర్రగొండపాలెం సిఐ ప్రభాకరరావు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలులోని డ్రీమ్ రెస్టారెంట్ వద్ద బైకు అదుపు తప్పి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన విషయం తెలిసిందే. నల్లగుంట్ల గ్రామానికి చెందిన బుల్లెట్ భాషా (36)కు తీవ్ర గాయాలు కావటంతో గిద్దలూరు ఏరియా హాస్పిటల్ ప్రథమ చికిత్స చేయించి అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. నంద్యాలలోని శాంతిరాం వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



పోలీసు కుటుంబాలను సన్మానిస్తున్న ఎస్‌పి దామోదర్

పోలీసుల సేవలు మరువలేనివి

జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్

పదవీ విరమణ పొందిన ముగ్గురికి సత్కారం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం పనిచేసిన వారి సేవలు మరువలేనివని జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ తెలిపారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఉద్యోగ విరమణ పొందిన కనిగిరి డిఎస్‌పి ఆర్.రామరాజు, ట్రాఫిక్ పియస్ ఎస్ఐ వి.డేవిడ్, పోలీస్ కంట్రోల్ రూమ్ ఎస్ఐ ఎస్‌డి మీరా సాహిబ్‌ను పోలీస్ అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ విధి నిర్వహణలో కేటాయించిన అన్ని విధులు సమర్థవంతంగా పనిచేసి మంచి అధికారులుగా పేరు తెచ్చుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌పి(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్‌పి (క్రైమ్) ఎస్‌వి శ్రీధర్ రావు, డిఎస్‌పిలు ఆర్.శ్రీనివాసరావు, రామరాజు, లక్ష్మి నారాయణ, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఐటి కోర్ సీఐ వి.సూర్యనారాయణ, పోలీస్ లీగల్ అడ్వైసర్ వేణుగోపాల్, సిఐలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధుల మధ్య విభేదాలు సృష్టించొద్దు

- చీరాలల్లో అందరం ఆత్మీయంగా ఉంటాం
- ప్రోటోకాల్ పాటించకనే సమస్యలు : జంజనం
- అందరం కలసి అభివృద్ధికి కృషి చేద్దాం : కొండయ్య

ప్రజాశక్తి - చీరాల, బాపట్ల జిల్లా

పురపాలక కార్యాలయంలో ఆగస్టు 15న జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కమిషనర్ కె చక్రవరి ప్రోటోకాల్ పాటించక పోవడం, అన్నాక్యాంటిన్ ప్రారంభోత్సవానికి ఛైర్మన్, కౌన్సిలర్లకు ఆహ్వానం లేకపోవడంతో పాటు పురపాలనకు సంబందించి అంశాల్లో కమిషనర్ వైఖరి వివాదాస్పదం కావడం శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో చర్చకు దారి తీసింది. అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్ల మధ్య కమిషనర్ కేంద్రంగా రచ్చ జరిగే పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో హాజరైన స్థానిక శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్య జోక్యం చేసుకున్నారు. ఇకమీదట ఎలాంటి ప్రొటోకాల్ గొడవ ఉండదని అన్నారు. అందరం కలసి అభివృద్ధికి కృషి చేద్దామని చెప్పడంతో కౌన్సిల్ సమావేశం సజావుగా ముగిసింది. ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అజెండాలోని 19 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పట్టణంలో అభివృద్ధి పనుల కోసం మంజూరైన నిధులకు సంబందించి జరగాల్సిన చెల్లింపుల విషయమై కౌన్సిల్‌లో చర్చించారు. గత రెండేళ్ళుగా పురపాలక సంఘం నిధుల కొరత కారణంగా ఇబ్బందులు పడుతుందని, రాష్ట ప్రభుత్వం నుంచి నిధులు రాని



సమావేశంలో ఎమ్మెల్యే కొండయ్య, ఛైర్మన్ శ్రీనివాసరావు

కారణంగా వార్డుల్లో చేపట్టిన పనుల కోసం జనరల్ ఫండ్ నుంచే వాడాల్సి వస్తుందని ఛైర్మన్ తెలిపారు. పన్నుల ద్వారా వస్తున్న నగదు జీతాల చెల్లింపులకే అత్యధికంగా ఖర్చు అవుతుందన్నారు. పట్టణంలో పన్ను వసూళ్ళను పూర్తిస్థాయిలో రాబట్టాలని, ప్రభుత్వం నుంచి నిధుల కోసం శాసనసభ్యులు తమ వంతు కృషిచేయాలని కోరారు. పట్టణంలో ఇష్టానురీతిన వెలిసిన ఫ్లెక్సీల విషయంలో నిబంధన మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఛైర్మన్ కోరారు. రోడ్డుకు అడ్డుగా ఉన్నా, ఫ్లెక్సీల వలన ప్రజలకు ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉన్న వాటిని తొలగించాలని ఎమ్మెల్యే కొండయ్య సూచించారు. రోడ్లపై ఆవుల సంచారం వలన ప్రమాదాలు జరుగుతున్నందున వాటిని తరలించి కారంచేడు రోడ్డులోని మున్సిపల్ స్థలంలో ఉంచి ఎవరు రాకపోతే గోశాలకు వాటిని అప్పజెప్పాలని నిర్ణయించారు. పట్టణంలో కుక్కల బెడద ఉన్నందున ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని కమిషనర్ చక్రవర్తి చెప్పారు.

మున్సిపల్ కమిషనర్ తన వైఖరి మార్చుకోవాలి

కమిషనర్ కె చక్రవర్తి అనుసరిస్తున్న వైఖరితో పురపాలనలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, కమిషనర్ వైఖరిని మార్చుకోవాలని ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు కోరారు. కౌన్సిల్ అజెండాపై చర్చ, ఆమోదం అనంతరం జీరోఅవర్‌లో ఛైర్మన్ మాట్లాడారు. కమిషనర్ వైఖరితో ప్రజాప్రతినిధుల మధ్య విభేదాలు తలెత్తు తున్నాయన్నారు. కమిషనర్ అందరినీ కలుపుకు పోయే విధంగా ఉండాలని కోరారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు, అన్నా క్యాంటిన్ ఓపెనింగ్‌లో ప్రొటోకాల్ పాటించలేదని అన్నారు. చీరాలలో అందరం ఆత్మీయంగా ఉంటాం. కమిషనర్ అనుసరిస్తున్న వైఖరితో పొరపాచ్చాలు వస్తున్నాయని ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. ఈ విషయమై ఎమ్మెల్యే కొండయ్య జోక్యం చేసుకుని స్వాతంత్ర దినోత్సవం రోజున వరుస కార్యక్రమాలు, తన హడావుడితో ప్రోటోకాల్ సమస్య తలెత్తిందన్నారు. ఇకమీదట అలాంటి సమస్యలు లేకుండా ప్రోటోకాల్ ప్రకారం వెళ్దామన్నారు. అందరి ఆలోచనల ప్రకారం పొరపాట్లకు తావు లేకుండా చీరాల అభివద్ధికి పాటుపడదాం అన్నారు. 25ఏళ్ల పడిన శ్రమతో తాను ఎమ్మెల్యేనయ్యానన్నారు. కౌన్సిల్ సభ్యులు ఎలాంటి ప్రచారాలు నమ్మకుండా, ఎవైనా సమస్యలు ఉంటే తనదృష్టికి తేవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ కట్ట మంగ

సాదాసీదాగా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - రేపల్లె

మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శనివారం సాదాసీదాగా ఎటువంటి చర్చ లేకుండానే ముగిసింది. ఛైర్ పర్సన్ కట్టా మంగ అధ్యక్షతన జరిగిన సమావేశానికి 9 మంది కౌన్సిలర్లు హాజరు కావడంతో కోరం సరిపోవడంతో సమావేశాన్ని ప్రారంభించి ఎజెండాలోని 16 అంశాలను చదివి ఎటువంటి చర్చ లేకుండానే కౌన్సిలర్లు ఆమోదించారు. సమావేశంలో వైస్ ఛైర్మన్లు ప్రశాంత్ కుమార్, కౌన్సిలర్లు, కమిషనర్ బిఆర్ శేషాద్రి, డిఈ ఈ శివరామకృష్ణ, ఎఐ రోహిణి, ఇన్చార్జి మేనేజర్ రూపాంజలి, పారిశుద్ధ్య ఇన్చార్జి అధికారి సురేంద్ర కుమార్, ఆర్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.



కోఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్ కోపనాతి నాగబాబు

పీతల మార్కెటింగ్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - రేపల్లె

ఆంధ్రప్రదేశ్ పీతల మార్కెటింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షులుగా రెండోసారి రేపల్లె ప్రాంతానికి చెందిన కోపనాతి నాగబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అమలాపురంలో శుక్రవారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏపీ పీతల మార్కెటింగ్ కోపరేటివ్ సొసైటీ లిమిటెడ్ పాత కార్యవర్గ సభ్యులను కొనసాగిస్తూ కమిటీని ఎన్నుకున్నట్లు నాగబాబు తెలిపారు. రెండోసారి తనను అధ్యక్షులుగా ఎన్నుకోవడం పాత కమిటీ సభ్యులనే కొనసాగిస్తూ ఎన్నికలు నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కరోనా సమయంలో గత వైసిపి ప్రభుత్వంలో సొసైటీ కార్యకలాపాలు పూర్తిగా స్తంభించాయని అన్నారు. గత ప్రభుత్వం సభ్యుల సంక్షేమానికి, అభివృద్ధికి ఎలాంటి తోడ్పాటు అందించలేదని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆక్వా రంగం తీర ప్రాంతంలో అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని అన్నారు. అందుకు అనుగుణంగా సొసైటీ కార్యవర్గ సభ్యులు ఐకమత్యంతో సమిష్టిగా సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబును స్వయంగా కలిసి మార్కెటింగ్ కోపరేటివ్ సొసైటీ సమస్యలు, తీర ప్రాంతంలో మత్స్య పరిశ్రమ అభివృద్ధి, ఎగుమతులు, దిగుమతులు గురించి వివరించనున్నట్లు తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులను పలువురు అభినందించారు.



కూలిన చెట్లను తొలగిస్తున్న సర్పంచి టి. కృష్ణమోహన్

వర్షానికి కూలిన చెట్లు

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని తోకలవానిపాలెం పంచాయతీ పరిధిలో ఈదురు గాలులు, భారీ వర్షం కురవడంతో ఆర్అండ్‌బి రోడ్డుపై చెట్లు ఇరిగి పడ్డాయి. వాహన దారులకు అడ్డుగా ఉండడంతో పంచాయితీ సిబ్బందితో పడిపోయిన చెట్లను సర్పంచ్ టి కృష్ణమోహన్ స్వయంగా దగ్గరుండి శనివారం తొలగించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశం

ప్రజాశక్తి - అద్దంకి

ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని చెప్పారు. ప్రమాదాల నివారణపై అధికారులు దృష్టి సారించాలని అన్నారు. రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ప్రజలు అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని పేర్కొన్నారు. విద్యుత్ తీగలు తెగిపడినా, కిందకు జారిన వెంటనే సమీప అధికారులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. తాకడం, పక్కకు నెట్టడం వంటి పనులు చేయవద్దని సూచించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కారానికి చొరవ చూపాలని చెప్పారు. అలసత్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. భారీ వర్షాలు, తుఫానుల సమయంలో విద్యుత్ శాఖ అధికారులపైనే ఉన్నత బాధ్యత ఉంటుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ బాపట్ల జిల్లాలో పరిస్థితిని వివరించారు.



మంత్రి రవికుమార్

సీఎం చేసిన సూచనలతో కలెక్టర్‌ను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో జరుగుతున్న పెన్షన్ల పంపిణీపై కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. పింఛన్ల పంపిణీ విషయంలో సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం వ్యసులు బాటు కల్పించిందని, వచ్చే రెండు, మూడు రోజుల్లో సచివాలయ ఉద్యోగులు పింఛన్ల పంపిణీ పూర్తి చెయ్యవచ్చన్నారు.



స్వర్ణ, తిమిడిదపాడు మధ్య తెగిన పిల్లవాగు

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

ప్రజాశక్తి -కారంచేడు

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎగువ నుంచి కురిసిన భారీ వర్షాలకుతోడు స్థానికంగా కురుస్తున్న వర్షాలు తోడవడంతో కాలువలు, వాగులు నిండిపోయాయి. ఎప్పుడు ఏ వాగు తెగుతుందో అర్థం కాని పరిస్థితుల్లో ప్రజలు ఆందోళనలో ఉన్నారు. శనివారం మధ్యాహ్నం కేశవరపాడు, తిమిడిదపాడు ప్రధాన రహదారి మధ్యలోని పిల్లవాగు తెగడంతో రోడ్డు కొట్టుకొని పోయింది. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. ఈ రహదారి గుండా తిమిడిదపాడు, పూసపాడు గ్రామాలకు ప్రజలు ప్రయాణిస్తుంటారు. వాగు తెగడంతో రోడ్డుపై కంచెలు వేసి అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. దీంతో ప్రజలు పర్చూరు, కారంచేడు నుంచి ఆదిపూడి మీదుగా రాకపోకలు చేస్తున్నారు. ప్రతి ఏటా ఇదే పరిస్థితి కొనసాగుతుంది. కేశవరపాడు, తిమిడిదపాడు మధ్యలోని పిల్ల వాగు ప్రతిఏటా వరదలు వచ్చినప్పుడు రోడ్డు కొట్టుకొని పోయి నీళ్లు ప్రవహించడం పరిపాటిగా మారింది. వంకాయలపాడు వద్ద వాగు తెగడంతో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. స్వర్ణ, పోతినవారిపాలెం మధ్యలో చప్ట వద్ద నీరు ఎక్కువగా చేరింది. ఎప్పుడైనా రోడ్డు మీదకు వరద నీరు వచ్చే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. మరొక రోజు గడిస్తే ఎలా ఉంటుందో పరిస్థితి చెప్పలేమని స్థానికులు అంటున్నారు. అధికారులు యుద్ధ ప్రాతిపది కన చర్యలు తీసుకొని లోతట్టు ప్రాంతాల్లో పటిష్టంగా ఉండే బ్రిడ్జిలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంకొల్లు : నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో ఖరీఫ్ పంటగా సాగుచేసిన మినుము, మొక్కజొన్న, పశుగ్రాసం తదితరపైర్లు వర్షాభావంతో గత వారం రోజులుగా ఎండు ముఖం పట్టాయి. దీంతో వర్షం కురవదని ఈపాటికే కొందరు రైతులు నీటి తడులు ఇచ్చి తమపైర్లను కాపాడుకోవటానికి ఉపక్రమించారు. గత రెండు రోజుల్లోగా కురుస్తున్న వర్షంతో ఖరీఫ్ పంట సాగు చేసిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షం పంటలకు ఊపిరి పోయేటమే కాకుండా నీటి తడులు ఇచ్చే ఖర్చు కూడా రైతులకు తప్పించిందని అంటున్నారు.

కృష్ణానదికి వరద దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి



కృష్ణానది వరదపై సమీక్షిస్తున్న శేషగిరి బాబు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

కృష్ణా నదికి క్రమంగా వరద నీటి ఉధృతి పెరుగుతున్న దృష్ట్యా లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రత్యేక అధికారి డివి శేషగిరి బాబు సూచించారు. ప్రకాశం బ్యారేజీ నుండి కృష్ణా నది దిగువకు విడుదల చేసిన వరదనీటి ప్రవాహాన్ని శనివారం పెదలంక వద్ద కాకులు డొంక సమీపంలో పరిశీలించి అధికారులతో ఆయన సమీక్షించారు. 3లక్షల క్యూసెక్కు లకుపైగా వరద నీరు ప్రవహిస్తుండటంతో నది పరివాహక లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఉధృతి పెరిగితే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వరద నీరు మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పా రు. దీని దృష్ట్యా లోతట్టు ప్రాంతాల పంట పొలాలు, గృహాలు నీట మునిగే అవకాశం ఉందని అన్నారు. లంక గ్రామాల నుండి బయటకు వెళ్లటానికి ఉన్న పెదపులి వర్రు, కోళ్లపాలెం, ఓలేరు గ్రామాల వద్ద చిన్న రేవుపై ఉన్న చెప్తాలు వరదనీటికి మునిగిపోయే అవకాశం ఉందని, దానిపై ప్రజలు రాకపోకలు కొనసాగించరాదని హెచ్చరిం చారు. రేపల్లె ఆర్డిఓ హేలా షారోన్, ఎం హనుమంతరావు, తహశీల్దారు ఎం శ్రీనివాసరావు, ఎంపిడిఒ గుమ్మా చంద్రశేఖర్, ఆర్ఐ శివరామకృష్ణ, శ్రీనివాస రావు, ఎం జకరయ్య, రాంబాబు, ప్రసాదు ఉన్నారు.

కర్తపాలెం : వాయుగుండం ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్లన మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు వెంకటరత్నం అన్నారు. మండలంలోని పేరలి హైస్కూలులో పునరావాసం కేంద్రం ఏర్పాటు చేసి పేరలి గ్రామంలోని లోతట్టు ప్రాంతంలో నివసిస్తున్న యనాదులను తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవ్వరూ అవసరం ఉంటేనే బయటకు రావాలని అన్నారు. పిడుగులు పడే అవకాశం వున్నందున సురక్ష ప్రాంతాలకు రావాలని సూచించారు. అనంతరం పునరావాస కేంద్రంలోని వసతులను పరిశీలించారు.



పునరావాస కేంద్రాలకు చేరిన ప్రజలు

ప్రజాశక్తి 5
ఆదివారం 1 సెప్టెంబర్ 2024

ఆత్మ విశ్వాసం ముందు ఓడిన అంగవైకల్యం

- విద్యుత్ షాక్‌తో రెండు చేతులు కోల్పోయినా...
- పట్టుదలతో బిఎస్‌సి, బిఇడి పూర్తి
- ఆదర్శ వివాహం చేసుకున్న వైనం
- ప్రైవేటు టీచర్‌గా రాణిస్తున్న ప్రభాకర్



బోర్డుపై బెల్టు సహాయంతో రాస్తున్న ప్రభాకర్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఐదో తరగతిలోనే విద్యుత్ షాక్‌కు గురై రెండు చేతులు కోల్పోయాడు. అయినప్పటికీ వైకల్యం లెక్క చేయకుండా బిఎస్‌సి, బిఇడి పూర్తి చేశాడు. ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ తన కాళ్లపై తాను నిలబడి ఆత్మ విశ్వాసం ముందుకు సాగుతున్నాడు మన్నెం ప్రభాకర్. అందిరికీ సూర్ఫిగా నిలుస్తున్నాడు.

ప్రమాదం జరిగిందిలా..

ఇంకొల్లు మండలం ఇడుపులపాడు గ్రామానికి చెందిన మన్నెం సింగయ్య, గంగమ్మలకు మూడో సంతానం మన్నెం ప్రభాకర్. ఆయన ఐదో తరగతి చదువుతున్న సమయంలో తుఫాను కారణంగా విద్యుత్ స్తంభాలు విరిగిపడిపోయాయి. ఆటడుకుంటూ వెళ్లి తెగిన కరెంటు తీగలను పట్టుకున్నాడు. దీంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. హుటాహుటినా గుంటూరు జనరల్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. చివరకూ రెండు నెలలు వ్యవధిలో రెండు చేతులను తొలగించారు. దీంతో వికలాంగుడిగా మారిపోయాడు. విద్యుత్ శాఖవారు అప్పట్లో మందులు ఖర్చులు ఇచ్చారే కాని ఆ తర్వాత ముఖం చాటేశారు.

విద్యాభ్యాసం పట్ల ఆసక్తితో..

మొదటి నుంచి ప్రభాకర్‌కు చదువు అంటే మక్కువ. విద్యుత్‌షాక్‌తో రెండు చేతులు కోల్పోయినప్పటికీ పట్టుదలతో సొంత గ్రామంలోనే ఆరో తరగతిలో చేరి పదో తరగతి వరకు అక్కడే చదివాడు. ఇంటర్, డిగ్రీ చదువులను గుంటూరులోని ఎసి కళాశాలలో పూర్తి చేశాడు. తర్లుపాడులో బిఇడి చదువును పూర్తి చేశాడు. డిఎస్‌సి రాస్తే ఐదు మార్కుల్లో ఉద్యోగ అర్హత కోల్పోయాడు.



పలకపై రాసిస్తున్న ప్రభాకర్

ఆదర్శ వివాహం...

ప్రభాకర్ వికలాంగుడు అయినప్పటికీ అంథురాలిని ఆదర్శ వివాహం చేసు కున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు. వారిద్దరికీ ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌తోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. సొంత ఇల్లు లేకపోవడంతో పుల్లలచెరువు మండలంలోని కవలకుంట్ల గ్రామంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు.

ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా..

పిల్లలు పెరుగుతున్న కొద్ది ఖర్చులు పెరగడంతో పూట గడవడం కష్టంగా మారింది. దీంతో పుల్లలచెరువులోని కొత్తూరు గ్రామంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో సైన్సు టీచర్‌గా రూ. 10 వేలు జీతానికి పని చేస్తున్నాడు. బోర్డుపై, పలకలపై బెల్టు సహాయంతో రాస్తున్నాడు. పుస్తకాల్లో, ఏమైనా ఇతర లెటర్లు రాయాలంటే నోటిలో పెన్ను పెట్టుకొని రాస్తాడు. అంతేకాకుండా తన పనులన్నీ తానే చేసుకోగలడు. విద్యార్థులతో ఆటలు ఆడించగలడు. క్రికెట్ కూడా ఆడుగలడు. ఆత్మవిశ్వాసంతో వైకల్యాన్ని ఓడించగలమని ప్రభాకర్ నిరూపించాడు.

ఇంటి స్థలం మంజూరు చేయాలి

మన్నెం ప్రభాకర్, వికలాంగుడు, కవలకుంట్ల



సొంత ఇల్లు లేకపోవడంతో అద్దె ఇంట్లో ఉంటున్నాం. ప్రభుత్వం ఇంటి స్థలం, పక్కా గృహం మంజూరు చేస్తే కొంత మేరకు ఊరట కలుగుతుంది. రెండు చేతులు లేని వారికి రూ. 10 వేల పింఛను ఇస్తామని చెప్పారు. జీవో జారీ చేయలేదు. దీంతో రూ. 6 వేలు పింఛను వస్తుంది. ప్రభుత్వం జీవో జారీ చేసి రూ. 10 వేల పింఛన్ మంజూరు చేస్తే కుటుంబాన్ని పోషించుకుంటా.



ప్రజలతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

పోలీసుల 'పల్లె నిద్ర'

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకోవడం వారి సమస్యల పరిష్కారం కోసం పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టినట్లు ఎస్‌పి తుషార్ డూడి తెలిపారు. ఎస్‌పి ఆదేశాల మేరకు ఎస్ఐ, ఆపై స్థాయి పోలీస్ అధికారులు తమ పరిధిలోని గ్రామాలలో 'పల్లె నిద్ర' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామం లోని పరిస్థితులు, అసాంఘిక కార్యకలాపాల గురించిన సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. నూతన చట్టాలు, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత నియమాలు తదితర విషయాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అడిషనల్ ఎస్‌పి టిపి. విఠలేశ్వర్, ఎఆర్ డిఎస్‌పి ఎస్.చంద్రమోహన్, బాపట్ల రూరల్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ రావు కంకటపాలెం గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. బాపట్ల డిఎస్‌పి జి.రామాంజనేయులు పాండురంగాపురం గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు.

క్రికెట్ జట్టు ఎంపిక వాయిదా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

భారీ వర్షాల కారణంగా ఈనెల 1న జరగాల్సిన అండర్-14 క్రికెట్ బాలుర జట్టు ఎంపికలు వాయిదా వేసినట్లు ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కారసాల నాగేశ్వరరావు తెలిపారు. ఈ విషయాన్ని గమనించి క్రికెట్ క్రీడాకారులు ఎవరూ ఎంపికలకు రావద్దని ఆయన కోరారు. క్రికెట్ బాలుర జట్టు ఎంపికల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని ఆయన తెలియజేశారు.

మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఎస్ మురళి అన్నారు. మండలంలోని ఆనికాలపల్లి ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద శనివారం నిర్వహించిన వన మహొత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆయా పాఠశాలల వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లు పెంచడం వల్ల అనంత జీవకోటికి ప్రాణవాయువు లభిస్తుందన్నారు. వాతావరణ సమతుల్యం దెబ్బతినకుండా సకాలంలో వర్షాలు పడతాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఒక మొక్కను అయినా నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి, అంగన్‌వాడీ కార్యకర్త షహనాజ్, ఉపాధ్యాయురాలు అలేఖ్య, విజయలక్ష్మి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ భాగ్యవతి

నిధుల గోల్‌మాల్‌పై విచారణ

పజాశక్తి-తర్లుపాడు

తర్లుపాడు పంచాయతీలో నిధుల గోల్‌మాల్‌పై డిపిఒ ఆదేశాల మేరకు మార్కాపురం డివిజనల్ పంచాయతీ అధికారి యడ్లూరి భాగ్యవతి శనివారం విచారణ చేపట్టారు. నిధుల గోల్‌మాల్‌పై గతంలో అప్పటి డిఎల్‌పిఒ నాగేశ్వరరావు విచారణ జరిపారు. ఆ సమయంలో పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు విచారణకు హాజరు కాలేదు. దీంతో విచారణ వాయిదా వేశారు. అనంతరం అప్పటి డిఎల్‌పిఒ నాగేశ్వరరావు సస్పెండ్ అయ్యారు.ఈ క్రమంలో విచారణ వాయిదా పడింది. తాజాగా నిధుల గోల్‌మాల్‌పై విచారణ జరిపి నివేదిక అందజేయాలని మార్కాపురం డిఎల్‌పిఒ భాగ్యవతికి డిపిఒ ఆదేశాలు జారీచేశారు. అందులో భాగంగా డిఎల్‌పిఒ స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు, ఇఒపిఆర్‌డి బాలకష్ణ,సర్పంచి వరాలును విచారించారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా మంజూరైన నిధులు,ఖర్చులు వివరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సైడ్ కాలువల పూడికతీత, బోరు మరమ్మతులు, నూతన బోరు నిర్మాణాలు, కార్యాలయ ఖర్చులంటూ మార్చిన బిల్లులు,కొన్ని అస్తవ్యస్తంగా రికార్డులు ఉండటంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్త రిక్షాలు ఉండగా, పంచాయతీ ట్రాక్టర్ తో చెత్తని తరలించడంపై మండిపడ్డారు.డంపింగ్ యార్డ్ నిర్వహణ అంటూ లక్షల రూపాయలు పంచాయతీ నిధులు దుర్వినియోగం ఎలా చేస్తారంటూ ప్రశ్నించారు. కార్యాలయ ఖర్చులు నిమిత్తం లక్షల రూపాయలు సొంత ఖాతా ఎలా బదిలీ చేసుకుంటారంటూ పంచాయతీ కార్యదర్శిని నిలదీశారు. నివేదికను జిల్లా అధికారులకు పంపనున్నట్లు డిఎల్‌పిఒ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.నరసింహులు, కార్యాలయ సూపరిండెంట్ బి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎస్‌పి దామోదర్

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తా

ఎస్‌పి ఎఆర్.దామోదర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తానని, విధులలో మరణించిన, అనారోగ్యంతో చనిపోయిన పోలీసుల కుటుంబాలకు సహాయ సహకారాలు అందిస్తానని జిల్లా ఎస్‌పి దామోదర్ తెలిపారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ శాఖలలో విధులు నిర్వహిస్తూ మరణించిన, అనారోగ్యంతో చనిపోయిన, విశ్రాంత పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులతో ఎస్‌పి శనివారం సమావేశం నిర్వహించారు. వారికి అందవలసిన బెనిఫిట్స్ ఇతర సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రభుత్వం నుండి రావాల్సిన రాయితీలు త్వరితగతిన అందేలా చూస్తామన్నారు. పెండింగ్ ఫైల్స్‌ను త్వరగా పూర్తి చేసేందుకు సంబందిత డిపిఒ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విశ్రాంత పోలీస్ సిబ్బంది ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను జిల్లా ఎస్‌పి సూచించారు.. విధులు నిర్వహిస్తూ మరణించిన పలువురు సిబ్బంది కుటుంబ సభ్యులు అబ్దుల్ రహీం సతీమణి ఎస్‌కె షాహిన్ కి ఫ్లాగ్ ఫండ్ 25,000, నెమలి రెడ్డి సతీమణి రాధకుమ ఫ్లాగ్ ఫండ్ 25,000, హోంగార్డు బి.డేవిడ్ సతీమణి బి.శారద వెల్ఫేర్ ఫండ్ 15,000, హోంగార్డు ఐ.కొండల రావు సతీమణి మాధవికి 10,000 చెక్కును జిల్లా ఎస్‌పి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌పి (అడ్మిన్) కె.నాగేశ్వర రావు, ఎఒ ఎం.సులోచన, ఆర్ఐ సీతారామరెడ్డి, సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ మర్దన్ అలీ శనివారం ఉద్యోగ విమరణ చేశారు. ఈ సందర్భంగా శ్రేయోభిలాషులు శనగల వెంకటేశ్వరరెడ్డి మర్దన్ అలీకి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. **ప్రజాశక్తి- ఒంగోలు**

కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డుగా గుర్రపుడెక్క

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పంట పొలాలు పూర్తిగా నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. వర్షాలకు ముందు వరకు రైతులు అష్ట కష్టాలు పడి ఆయిల్ ఇంజన్ల ద్వారా నీటిని నింపుకొని వరి నాట్లు పూర్తి చేసుకోగా అల్పపీడన ద్రోనీతో కురిసిన వర్షాలు పురిటిలో సందులాగా నాట్లు పూర్తి కాగానే వర్షపు నీటికి మునిగిపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఏడాది ఖరీఫ్ సీజన్లో రైతులు అధిక శాతం వెద పద్ధతిలో వరిసాగు చేపట్టారు. కాగా అతి తక్కువ ప్రాంతాల్లో నార్లు పోసి నాట్లు వేశారు. ఈ విధానం మండలంలో ఎక్కువగా ఉంది. రైతులు పోసుకున్న నారు మడులు అక్కడక్కడ మిగిలిపోవటంతో వాటిని ట్రాక్టర్లతో త్రొక్కించి మరి నాట్లు పూర్తి చేశారు. ప్రస్తుతం వర్షం నీటికి పంటలు మునిగిపోయి దెబ్బతింటే మరో సారినాట్లు వేయటానికి నార్లు దొరికే పరిస్థితి లేదని వాపోతున్నారు. మరో మూడు రోజుల వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు మరింత ఆందోళనకు గురవుతున్నారు. నీట మునిగిన పంట పొలాలు ఇంతటితో వర్షం లేకపోతే నీరు దిగిపోయి రెండు రోజులకైనా పైరు బయటపడుతుందని, వర్షాలు ఎడతెరిపి లేకుండా కురిస్తే నీటిలో మునిగిపోయిన పైరు దెబ్బతిని పనికిరాకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుర్రపు డెక్కతో పూడిపోయిన కాలవలు

గత నాలుగైదేళ్లుగా మురుగు కాలువలకు ఎలాంటి మరమత్తులు చేపట్టకపోవడంతో ఎక్కడికక్కడ పూడిక పేరుకుపోయింది. మురుగు కాలువలు వర్షపు నీటిని బయటికి తరలించే పరిస్థితి కనిపించడం లేదు. భట్టిప్రోలులోని అద్దేపల్లి నుండి గూడవల్లి వరకు కొనసాగే అప్లోయెంట్ మురుగు కాలువ గుర్రపు డెక్క పేరుకు పోవడంతో గత నెలలో పత్రికలు కథనాలు రాయడంతో స్పందించిన అధికారులు గుర్రపు డెక్కన్ తొలగించకుండా మందు పిచికారి చేసి వదిలేసారు. ఈ మందులకు గుర్రపు డెక్క చనిపోయి ఎండిపోయినప్పటికీ కాలువల్లో అలాగే పేరుకుపోయి ఉండటంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షంపు మీరు వేగంగా బయటికి మల్లె పరిస్థితి కనిపించడం లేదు. దీని వలన నీట మునిగిన వరిపైరు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ మురుగు కాలువ కట్టలు కూడా మునిగిపోయి పొలాలతో కలిసిపోయి ఉన్నాయని, నీరు తగ్గాలంటే గుర్రపుడెక్క నీటి ఉధృతిని అడ్డుకుంటుందని రైతులు చెబుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఈ ఏడాది రైతులు ఆదిలోనే తీవ్రంగా కష్టాలను చవిచూడాల్సి ఉంటుందని వాపోతున్నారు.



కాలువలో నీటిపారుదలకు అడ్డుగా గుర్రపు డెక్క

100 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

ప్రజాశక్తి - అద్దంకి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో భారీ వర్షాలు శుక్రవారం అర్ధరాత్రి నుండి మొదలయ్యాయి. పట్టణ పరివాహక ప్రాంతంలోని శివారు కాలనీల్లో వర్షపు నీటితో రోడ్డులు జలమయం అయ్యాయి. ఎన్టీఆర్ నగర్, గుర్రాల కాలనీలో అక్కడక్కడ పూరి గుడిసెల్లో నీరు చేరాయి. మండలంలో అనేక గ్రామాల్లో రైతులు ఇప్పటికే మొక్కజొన్న, వరి నారుమళ్ళు నీట మునిగాయి. పంటలు వేసిన రైతులకు ఈ వర్షం ఎంతో ఉపయోగకరంగా ఉన్నప్పటికీ ఎడతెరిపి లేని వర్షంతో వాగులు వంకలు ఏకమయ్యాయి. నల్లవాగు, గుండ్లకమ్మల్లో ఉధృతంగా నీరు ప్రవహిస్తున్నాయి. గత నాలుగు ఐదేళ్ల అనంతరం అత్యధికంగా వర్షపాతం నమోదు కావడం ఇది మొదటి సారి. పట్టణంలో వర్షపు నీరు రోడ్లపై ప్రవహించింది. గత 20 రోజుల నుండి వీస్తున్న గాలులకు మొక్కజొన్నపైరు ఎండు ముఖం పట్టాయి. పట్టణంలో ఈ వర్షంతో మురుగునీరు డ్రైనేజీ నుండి పొంగి ప్రవహించాయి. గ్రామాల్లో పొలాల్లో మోకాలు లోతు వర్షం నీరు ఉంది. ఈ వర్షం ఇలానే కొనసాగితే వరి నారుమళ్లు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కర్లపాలెం : మండంలోని కర్లపాలెంలోని పశు వైద్యశాల గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి పూర్తిగా నీట మునిగింది. గత కొన్నేళ్లుగా శిథిలావస్థలో ఉన్న పశు వైద్యశాలకు నూతన భవనాన్ని నిర్మించాలనే ఆలోచన గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు విన్నవించుకున్న పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వమైనా స్పందించి ప్రజలకు ఉపయోగపడే విధంగా పశు వైద్యశాలను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. పశువైద్యశాల్లో ఉండి మూగజీవులకు వైద్యం చేయాలంటే హడలిపోతున్నారు. పశువైద్యశాల లోపలికి నీరు చేరి ప్రమాదకరంగా మారిందని, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో సిబ్బంది పశువులకు వైద్యం చేయలేని పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నూతన భవనాన్ని నిర్మించాలని ప్రజానీకం కోరుతున్నారు. లేదా తాత్కాలికంగా నైనా వేరొక భవనంలోనికి మార్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కొల్లూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా శుక్రవారం రాత్రి నుండి ఎడతెర్పు లేకుండా కురుస్తున్న వర్షానికి మండలంలోని వివిధ గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక ఇళ్లల్లోకి వర్షపు నీళ్ళు చేరాయి. ఈ వర్షం వలన డ్రైనేజీలు పొర్లి మురుగు నీరు రోడ్లపైకి వస్తున్నాయి. వీటి ప్రభావంతో దోమల బెడద ఎక్కువై విష జ్వరాలు విజృంభిస్తాయేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారని సిపిఎం నాయకులు బొనిగల సుబ్బారావు అన్నారు. మండలంలోని అధికారులు గ్రామాల్లో పర్యటించి పరిస్థితులను పరిశీలించాలని కోరారు.



కొల్లూరులో ఇళ్లలోకి చేరిన వర్షపు నీళ్లు

వర్షాల సమయంలో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - అద్దంకి

వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తడిసిన కరెంట్ స్థంబాలను, తడిసిన చేతులతో స్టార్టర్లు, మోటార్లును ముట్టుకుంటే షాక్‌తో ప్రమాదాలు జరుగుతాయని విద్యుత్ అధికారులు తెలిపారు. విద్యుత్ లైన్‌కు తగులుతున్న చెట్ల దగ్గరకు వెళ్ళొద్దని తెలిపారు. విద్యుత్ లైన్‌కు చెట్టు కొమ్మలు తగిలితే సంబంధిత అధికారికి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్కుల్లో, స్టేడియంలో, రోడ్లపై టీ దుకాణాల వద్ద ఉన్న స్తంభాలను కూడా ముట్టుకుంటే ప్రమాదాలు జరుగుతాయని అన్నారు. ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టుకోరాదని అన్నారు. బయట పెట్టిన లైట్లు నీటితో తడవకుండా చూసుకోవాలని అన్నారు. కరెంటుకు సంబంధించిన వస్తువులు తడి చేతులతో ముట్టుకోరాదు. చిన్న పిల్లలను కరెంటు వస్తువుల వద్దకు రాకుండా చూసుకోవాలి. గృహాల వద్ద ఉతికిన బట్టలు ఇనుప తీగలపై వేయకూడదని, దుమారం, వర్షం వలన తెగిన విద్యుత్ వైర్లను ముట్టుకోరాదు. ఇంట్లో ఉన్న వాటర్ హీటర్ స్విచ్ ఆఫ్ చేసి ప్లగ్ తీసిన తర్వాతనే నీళు పెట్టిన వస్తువును ముట్టుకోవాలని, ఉరుములు, మెరుపులతో వర్షం పడేటప్పుడు డిష్ కనెక్షన్ తీసివేయాలని అన్నారు. వర్షం కురిసే సమయంలో టీవీ, ఫ్రిడ్జ్, కంప్యూటర్ స్విచ్‌లను ఆఫ్ చేయాలి. లేనిచో వైర్లు షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంటుందని, కరెంటు లైన్ క్రింద సెల్ ఫోన్ మాట్లాడకూడదు. ఇంట్లోకి వచ్చే సర్వీస్ వైర్ ఏమైన డ్యామేజ్ అయినచో సంబంధించిన అధికారి జెఎల్ఎం, ఎఎల్ఎం, ఎల్ఎం లేనిచో ఎఈకి సమాచారం అందించాలి.



రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి కింద భారీగా వరద నీరు

జలమయమైన అండర్ బ్రిడ్జి రహదారి

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని వెల్లలచెరువులో ఉన్న రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి కింద భారీగా వరద నీరు చేరి వాగుని తలపిస్తోంది. దీంతో గ్రామంలోని ప్రజలకు రాకపోకలు బంద్ అయింది. తుఫాన్ కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రైల్వే అండర్ బ్రిడ్జి కింద నాలుగు అడుగుల ఎత్తులో భారీగా నీరు చేరింది. దీంతో బస్సు మార్గం ద్వారా గ్రామంలోకి రావలసిన వాళ్లు గ్రామం చుట్టూ ఉన్న పొలాల గట్టుల ద్వారా రైలు కట్ట దాటి గ్రామంలోకి వెలుతున్నారు. దీంతో వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీరు బయటకు పోయే మార్గం లేదు. గ్రామంలోని ప్రజలు, ద్విచక్ర వాహనాలు, కార్లు, ఈ మార్గం ద్వారానే బస్టాండుకు చేరుకోవలసి ఉంది. గతంలో ప్రజలు ఈ విషయంపై రైల్వే ఉన్నత అధికారులకు వినతి పత్రాలు అందజేసినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజల ఇబ్బందులను గుర్తించి అండర్ బ్రిడ్జి కింద చేరుకున్న నీటిని తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



పేకాట రాయిళ్లను అదుపులోకి తీసుకున్న అనిల్ కుమార్

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మండలంలోని గుల్లపల్లి గ్రామ సరిహద్దుల్లో పేకాట శిబిరం నిర్వహిస్తుండగా అందిన సమాచారం మేరకు ఎస్ఐ అనిల్ కుమార్ పేకాట శిబిరంపై శుక్రవారం దాడి చేశారు. 25 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. రాత్రి 11 గంటల సమయంలో అందిన సమాచారం మేరకు పేకాట శిబిరంపై దాడి చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా పేకాట, కోడిపందాలు నిర్వహించినట్లయితే సమాచారం అందజేయాలని ప్రజలను కోరారు.ద

వర్షంతో రైతుల్లో ఆనందం

ప్రజాశక్తి - పర్చూరు

బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతాంగానికి కొంత ఊరట నిచ్చాయి. గత రెండు నెలలుగా వేసవిని తలపిస్తూ ఉక్కపోతతో ఎండ వేడిమితో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు ఈ వర్షం స్వేద తీర్చి నట్లయింది. పత్తి వేసిన రైతులకు నాటే రైతులకు కూడా ఈ వర్షం ఎంతో ఉపయోగ మని రైతులు అంటున్నారు. మిర్చి నారుమళ్ళకు ఎంతో ఉపయోగపడుతుందని రైతులు అంటున్నారు. పొలాల్లోని కుంటలు, చెరువులకు నీరు చేరుతుంది. తొండ వాగు ఎల్లవ వలన ఎడారిపల్లి, చెన్నుబొట్ల అగ్రహారం చెరువులకు నీరు చేరుతుంది. ఆ ప్రాంతంలోని కుంటలకు నీరు పుష్కలంగా చేరుతుంది. మండలంలోని కొత్తపాలెం, రమణాయపాలెం, చెరుకూరు భూముల్లో వరి నారు ఎదబెట్టిన రైతులకు కొంత నష్టం వాటిల్లవచ్చని అంటున్నారు. ఈ వర్షం ప్రభావంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మట్టి గణపతి విగ్రహాలు సిద్ధం

ప్రజాశక్తి - ఇంకొల్లు

వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి వినాయక ప్రతిమలను పండుగ రోజు హరిహర ధార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో అందజేయన్నట్లు కోట హనుమంతరావు తెలిపారు. పండుగ ముందు రోజు మట్టి ప్రతిమలు అందజేయనున్నట్లు తెలిపారు. రెండేళ్లుగా చేస్తున్నట్లు తెలిపారు.



నీట మునిగిన వరి నాట్లు వేసిన ఈదుపల్లి పొలం

నీట మునిగిన వరి నాట్లు

ప్రజాశక్తి - నగరం

మండలంలోని నగరం, ఈదుపల్లి గ్రామాల్లో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రైతులు సాగు చేసిన వరి పంట నీట మునిగింది. రెండు రోజులకు ముందు వరకు కాచిన ఎండలకు పంట పొలాలకు నీరు లేక నారుమల్లు ఎండిపోయిన పరిస్థితి ఉంది. ఒక్కసారిగా అల్పపీడన ద్రోనీతో కురుస్తున్న భారీ వర్షాలతో పూర్తి చేసుకున్న వరి నాట్లు కళ్ళముందే నీట మునిగిపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అనేక గ్రామాల్లో లోతట్టు ప్రాంతం మెరక ప్రాంతమని తేడా లేకుండా శుక్రవారం రాత్రి 10 గంటల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి తోడు శనివారం భారీ వర్షం కురవడంతో పొలాలు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. పూర్తి చేసుకున్న వరి నాట్లతో వర్షాలకు పంట పొలాలు దెబ్బతింటే మరోసారి సాగు చేయటానికి నారు దొరికే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ శాఖ మరో 3రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటిస్తుం డటంతో రైతులు మరింత ఆవేదనకు గురవుతున్నారు. ఈపాటికే ఎకరాకు రూ.10 వేలకు పైగా ఖర్చు చేయగా కొందరు ఈ ఖర్చుతో పాటు తొలి విడతగా ఎరువులను కూడా వినియోగించారు.

రేపల్లె : మండలంలో కురిసిన వర్షాలకు వివిధ గ్రామాల్లో వరిచేలు నీట మునిగాయి. వర్షాలు, కాలువలకు నీరు ఒకే సమయంలో రావడంతో వరి చేలు ముంపు బారిన పడ్డాయి. వర్షాలకు డ్రెయిన్లు ఎదురు తన్నడంతో వరద నీరు బయటికి వెళ్లే మార్గం లేక చేలల్లో నీరు నిలిచిపోవడంతో చేలు ముంపు బారిన పడి వరిపైరు నీటిలో కుళ్ళిపోతుందని రైతులు వాపోతున్నారు. దీంతో రైతన్నలకు ఏమి చేయాలో తెలీక లబోదిబో అంటున్నారు. వర్షానికి ముందు వరకు రైతులు ఆయిల్ ఇంజన్ల ద్వారా సాగు చేశారు. రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పొలాల్లో నీరు పెరగడంతో పెద్ద ఎత్తున నాట్లు దెబ్బతినే పరిస్థితి నెలకొంది. వర్షం ఇలాగే కొనసాగితే పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఇప్పటికే 90 శాతం నాట్లు పూర్తయ్యాయి. రైతులు ఎకరాకు రూ.15వేలకుపైగా పెట్టుబడి పెట్టారు. అధిక వర్షాలతో నష్టాల బారిన పడతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తుఫాను పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - వేమూరు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింతగా తీవ్ర రూపం దాల్చే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ప్రజలు, కృష్ణా నది పరివాహక ప్రాంత లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన కార్యదర్శి సోమరౌతు అనురాధ కోరారు. స్థానికంగా శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మాగాణి భూముల్లో వరి పైర్లు వెదజల్లి ఎక్కువ రోజులు కాకపోవటంతో భూముల్లో నీరు చేరి ప్రమాదం స్థాయిలో ఉన్న నేపథ్యంలో నీరు బయటకు తీసే ప్రక్రియను రైతులు చేపట్టాలన్నారు. రైతులు సమిష్టిగా మురుగు కాలువలకు నీరు వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కృష్ణానది లంక గ్రామాల్లోని పల్లపు ప్రాంత ప్రజలు ప్రభుత్వ అధికారులకు సహకరించి వారి సూచనలను పాటించాలన్నారు. శాసన సభ్యులు నక్కా ఆనందబాబు సూచనల మేరకు అధికారులు అప్రమత్తమై లోతట్టు ప్రాంత ప్రజలకు సూచనలు, సలహాలు ఇవ్వనున్నట్లు వివరించారు. గత ఐదేళ్ల కాలంలో రైతులకు అవసరమైన మరుగునీటి, సాగునీటి కాలువల మరమ్మత్తులు చేపట్టకపోవడంతో పంట పొలాలు ముంపుకు గురి కావాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కూటమి ప్రభుత్వం వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్లు 31న ఇవ్వటం అవ్వ, తాతల మోములో చిరునవ్వులు వెల్లివిరిశాయని అన్నారు. మును ముందు రోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా రంజక పాలన సాగిస్తుందని ఆశాభావం వ్యక్తం జేశారు.

భారీ వర్షాలు.. స్తంభించిన జనజీవనం

నీట మునిగిన కాలనీలు

ప్రజాశక్తి -రేపల్లె

భారీ వర్షాల ప్రభావంతో జనజీవనం స్తంభించింది. గత రెండు రోజులుగా తీర ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు పట్టణంలోని రోడ్లు జలమయం అయ్యాయి. చిరు వ్యాపారులు, రోజువారీ కూలీలు, ఆటో, రిక్షా కార్మికులు, చేతివృత్తి దారులు ఇళ్లకే పరిమితం అయ్యారు. పట్టణంలోని ఇందిరా యానాది కాలనీ, 2వ వార్డు, నేతాజీ నగర్, జగనన్న కాలనీలు నీట మునిగాయి. తుఫాను ప్రభావంతో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. కృష్ణానది, పెనుమూడి, పల్లెపాలెం నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు మోర్ల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెనుమూడి, పల్లిపాలెం ప్రజలకు వరద ఉధృతి అధికంగా వచ్చినప్పుడు మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎటువంటి విపత్కర పరిస్థితులైన ఎదుర్కొని ప్రజలకు సేవ చేసేందుకు రెవెన్యూ సిబ్బంది సిద్ధంగా ఉందని తెలిపారు. లోతట్టు ప్రాంతాలలో నివాసం ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద ముంపునకు గురవడానికి



లోతట్టు ప్రాంతాల్లో సూచనలిస్తున్న శ్రీనివాసరావు

అవకాశం ఉన్న ప్రదేశాలలో నివాసం ఉండే ప్రజలు ప్రభుత్వం సూచించిన పునరావాసల్లోకి వెళ్లాలని చెప్పారు. బ్రిడ్జిలు, కల్వర్టులపై వరద నీరు ప్రవహిస్తుంటే వాటిని దాటి వెళ్లే ప్రయత్నం చేయవద్దని చెప్పారు. ప్రత్యామ్నాయ మార్గాన్ని చూసుకోవాలని అన్నారు. ప్రజలు ప్రమాదాలకు గురికాకూడదనే ఉద్దేశంతో రెవెన్యూ అధికారులు సూచించే సూచనలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. మండలంలోని పెనుమూడి ఎంపీపీ స్కూల్లో పునరావాస కేంద్రంలో ప్రజలకు ఆహారం, తాగునీటి వసతులు కల్పించమని తహశీల్దారు మోర్ల శ్రీనివాసరావు తెలిపారు. ఇదిలా ఉండగా నాట్లు వేసిన వరి పొలాలు నీట మునిగాయి. ఆక్వా సాగు చేస్తున్న రైతులకు తుఫాను ప్రభావంతో తీవ్ర నష్టం వాటిల్లింది. అనేక చోట్ల చెరువులకు గండ్లు పడటంతో ఆక్వా రైతులు నష్టపోయారు. ఈదురు గాలులకు విద్యుత్ సరఫరా నిలిచి పోవటం, చెట్లు పడిపోవడంతో విద్యుత్ తీగలు తెగి సరఫరా లేక రొయ్యలను, చేపలకు ఆక్సిజన్ అందక ఆక్వా ఉత్పత్తులు దెబ్బతిన్నాయి. కృష్ణ నదిలో నుండి సముద్రంలోనికి చేపల వేటకు వెళ్లే చిన్న మోటార్ బొట్టులోనికి వర్షం నీరు చేరడంతో నదిలో నిలిపిన రాజుకాల్వ, లంకేవానిదిబ్బ గ్రామాలకు చెందిన మత్స్యకారుల బోట్లు మునిగిపోయి నట్లు తీర ప్రాంత రైతులు చెప్పారు. మరో 24 గంటలు వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె శివ పార్వతి, యుపిఆర్ డి మల్లికార్జునరావు, పశు వైద్య అధికారి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

జోరు వానలోనూ పింఛన్ల పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ కొండయ్య



అద్దంకిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - చీరాల

రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేసే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల మనిషని ఎంఎల్ఎ కొండయ్య అన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో శనివారం జోరు వర్షంలోను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని అన్నారు. కురుస్తున్న వర్షంను సైతం లెక్కచేయకుండా ఆయన పింఛన్ పంపిణీలో పాల్గొనడం ప్రజా పరిపాలనకు నిదర్శనం అన్నారు. అనంతరం నియోజకవర్గంలోని వివిధ చోట్ల పంపిణీలో ఎంఎల్ఎ పాల్గొన్నారు. ఆయన వెంట తెలుగుదేశం నియోజకవర్గ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్ర నాథ్, యువ నాయకులు గౌరీ అమర్నాథ్, తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీను, కౌన్సిలర్ మామిడాల రాములు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అద్దంకి : దేశ చరిత్రలోనే ముందుగా వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్లు పంపిణీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో పంపిణీ చేశారు. తెలుగుదేశం నాయకులు సందిరెడ్డి శ్రీనివాసరావు మాట్లాడారు. 1న ఆదివారం కావడంతో వృద్ధుల అవసరాల కోసం ఇబ్బం దులు పడతారనే సంకల్పంతో ముందురోజే పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు, మంత్రి గొట్టిపాటి రాష్ట్ర ప్రభుత్వానికి లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

మార్టూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుజేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సెప్టెంబర్ 1 ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే లబ్ధిదా రులకు పంపిణీ చేయమని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో మండలంలో శనివారం పింఛన్ల పంపిణీ చేసినట్లు ఎంపిడిఓ గోరికపూడి నితిన్ తెలిపారు. అల్పపీడన ప్రభావంతో జోరుగా కురుస్తున్న వర్షాలను సైతం లెక్కచేయకుండా సచివాలయ సిబ్బంది 98 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు తెలిపారు.

యద్దనపూడి : మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను శనివారం పంపిణీ చేశారు. 90శాతం పెన్షన్స్ పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ కృష్ణ కుమారి తెలి పారు. మిగిలిన పెన్షన్స్ సోమవారం పంపిణీ చేస్తామని తెలిపారు. ఇఒఆర్‌డి శ్రీనివాసరావు, కార్యదర్శి రాణి, వెల్ఫేర్ అసిస్టెంట్ అలేఖ్య, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : ప్రభుత్వం అందజేసిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో భాగంగా మండలంలో 95శాతం పైగా పెన్షన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపిడిఒ గుమ్మ చంద్రశేఖర్ తెలిపారు. ఎడతెరిపి లేకుండా శుక్రవారం నుండి కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పంపిణీలో పాల్గొన్నారు. 1న ఆదివారం రావడంతో ముందుగానే 31న ప్రభుత్వం పెన్షన్లు అందజేయడం పట్ల పెన్షన్ దార్లు ఆనంద వ్యక్తం చేశారు. భట్టిప్రోలులోని అద్దేపల్లిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ సాగర్‌తో పాటు నాయకులు యడ్ల జయశీలరావు, కంభం సుధీర్ పాల్గొన్నారు.



యద్దనపూడిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపిడిఒ



భట్టిప్రోలులో పెన్షన్లు అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవ స్థానం వెనుక వైపు భక్తులు బట్టలు మార్చుకునే రేకుల షెడ్డు లోపల గుర్తుతెలియని భిక్షాటన చేసే వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి జరిగింది. ఘటన స్థలానికి చేరుకొని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని గుర్తించిన వారు అద్దంకి సీఐ, ఎస్ఐ నంబర్లకు 91211 02167, 89787 77290 సమా చారం అందించవలసిందిగా పోలీసులు తెలిపారు.

గిరిజన కుటుంబాలు తరలింపు

ప్రజాశక్తి - చెరుకుపల్లి (అమర్తలూరు)

మండలంలోని ఎలవర్రులో వర్షాలకు నిరాశ్రయులైన 8యానాదుల కుటుంబాలను పాఠశాలకు తరలించారు. వారి ఇళ్లను సందర్శించి గ్రామంలోని పాఠశాల్లో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. మొత్తం 26 మంది సభ్యులను శిబిరానికి తరలించారు.

మత్స్యకారులు వేటకెళ్లొద్దు

ప్రజాశక్తి - చీరాల

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడుతుండటంతో రాబోయే రెండు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు చేసిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తం అయ్యారు. వర్షాలకు ప్రజలు ఇళ్లకే పరిమితం అయ్యారు. శనివారం కూడా భారీ స్థాయిలో వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. దండుబాటు ప్రాంతంలో ఇళ్ల చుట్టూ వర్షపు నీళ్లు చేరాయి. అసలే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వర్షం దాటికి డ్రైనేజీలు నిండి ఆ నీళ్లు ఇళ్లల్లోకి రావడంతో వ్యాపిస్తున్నాయని భయపడుతున్నారు. కొందరు ఇళ్లల్లోకి వచ్చిన వర్షం నీరును బయటకు ఎత్తి పోసుకొనే పరిస్థితి కనిపిస్తుంది. సాయికాలని, విజయ నగరకాలని రోడ్లపైకి వర్షం నీరు చేరింది. విజయనగర



మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎస్ఐ శివకుమార్

కాలనీలో ఇళ్ల స్లాబులు వర్షానికి నాని నీళ్లు వడుస్తు న్నాయి. ఇంట్లో ఉండలేక బయటకు రాలేక పరిస్థితి దారుణంగా ఉంది. వర్షం తగ్గే వరకు మత్స్యకారులు వేటకు వెళ్ల వద్దని సూచించారు. విలివైన బోట్లు, వేట సామాగ్రిని మేరకు ప్రాంతంకు తరలించుకోవాలని చెప్పారు.



నీటముమునిగిన ఇల్లును పరిశీలిస్తున్న తహశీల్దారు పద్మావతి

గుళ్లపల్లిలో ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి - చెరుకుపల్లి

స్థానిక గుళ్లపల్లి బోర్డమ్మ డొంకలో నివాసం ఉంటున్న బండ వాళ్ళ ఇళ్ళలో వర్షపు నీరు చేరాయి. పంచాయితీ పోరంబోకు స్థలంలో నివాసం ఉంటున్న వీరు రోడ్డు వెంబడి తాత్కాలిక గుడిసెల్లో నివాసం ఉంటుండగా శనివారం కురిసిన భారీ వర్షానికి ఇళ్లలోకి నీరు చేరింది. దీంతో స్థానిక రెవెన్యూ అధికారులు ఇళ్లను పరిశీలించారు. స్థానిక గుళ్లపల్లి హైస్కూలుకు తరలించారు. తహశీల్దారు పద్మావతి, ఆర్ఐ మౌనిక, విఆర్ఓ రమేష్ పాల్గొన్నారు.

3న జాబ్ మేళా

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలోని బేతపూడి రోడ్డులో గల శారద ఐటిఐ కాలేజీలో సెప్టెంబర్ 3న మంగళవారం జాబ్ మేళా నిర్వ హించనున్నట్లు కాలేజీ డైరెక్టర్ బడుగు వెంకటనారాయణ తెలిపారు. జాబ్ మేళాలో తడ శ్రీ సిటీకి చెందిన కొల్గేట్ కంపెనీ, గుంటూరుకు చెందిన నియోక్రాఫ్ట్ మెడికల్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ హాజరవుతారని తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్ అభ్యర్థులు జాబ్ మేళాకు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏకీకృత పెన్షనుకు వ్యతిరేకంగా నేడు నిరసన

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న ఏకీకృత పెన్షన్ పథకాన్ని వ్యతిరేకిస్తూ ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో నేడు జిల్లాలోని రేపల్లె, బాపట్ల, చీరాల, మార్టూరు, అద్దంకి తాలూకా కేంద్రాల్లో నిరసన కార్యక్రమా లను నిర్వహించనున్నట్లు ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు అమ్మిశెట్టి శేఖర్ బాబు కోరారు. శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న ప్రతిపాదిత పథకాన్ని వెంటనే ఉపసంహ రించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా నాయకులు పిడి సోషలిజం, జంపని శ్రీనివాసరావు, మాడుగుల కిషోర్, బుర్ర సాంబశివరావు, హరిరామయ్య పాల్గొన్నారు.

వినాయక మండపాల అనుమతికి వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

వినాయక మండపాలు ఏర్పాటు చేసుకోవాలంటే ప్రభుత్వం సింగిల్ విండో క్లియరెన్స్ విధానాన్ని తీసుకొచ్చింది. గణేష్ ఉత్సవ్.నెట్ అనే వెబ్ సైట్‌లో కమిటీ సభ్యుల వివరాలు, మండపం ఏర్పాటు చేసే ప్రాంతం, ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుంది, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, ఏ రోజు విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుంది, నిమజ్జనం ఎక్కడ చేస్తారు, ఏ వాహనం ద్వారా విగ్రహాన్ని తీసుకెళతారనే వివరాలను నమోదు చేసి దరకాస్తు చేసుకోవాలి. అనంతరం 799 509 5800 నంబర్ వాట్సాప్‌కు హాయ్ అని మెస్సేజ్ పెట్టాలి. అప్పుడు ఎన్‌ఒసి కోసం చేయాల్సిన ప్రక్రియ మొత్తం వాట్సాప్ ద్వారా మొబైల్‌కు సమాచారం వస్తుంది. అలాగే ఆ దరఖాస్తు సంబంధిత పోలీస్ స్టేషన్‌కు వెళుతుంది. స్థానిక పోలీస్ స్టేషన్ అధికారులు మండప ఏర్పాటు ప్రాంతాన్ని పరిశీలించి నిబంధనల ప్రకారం ఉంటే క్యూ ఆర్ కోడ్‌తో కూడిన ఎన్‌ఒసి జారీ చేస్తారు. దరఖాస్తు దారులు ఆ నిరభ్యంతర పత్రాన్ని ప్రింట్ తీసుకొని మండపాల్లో ఉంచాలి. పోలీస్ అధికారులు సందర్శనకు వచ్చినప్పుడు క్యూ ఆర్ కోడ్‌తో స్కాన్ చేసి తనిఖీ చేస్తారు.

జేసీ దంపతులకు సన్మానం

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

రెవెన్యూ శాఖకు ఒ వనరుగా జిల్లా సంయుక్త కలెక్టర్ సుబ్బారావు పనిచేశారని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ బి.సుబ్బారావు ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన సభ శనివారం నిర్వహివంచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకట మురళి, బాపట్ల ఎంపీ తెన్నేటి కష్ణ ప్రసాద్, బాపట్ల, చీరాల ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఎం.మాలకొండయ్య జిల్లా సంయుక్త కలెక్టర్ బి సుబ్బారావు, ఆయన సతీమణి పద్మలత దంపతులకు శాలువలు కప్పి పుష్పమాలలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఉప కలెక్టర్లు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఆర్‌డి రవీందర్, డిప్యూటీ కలెక్టర్ల రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు ధర్మచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి విశ్వేశ్వర నాయుడు, రెవెన్యూ అసోసియేషన్ అధికారులు, వివిధ జిల్లాల డిప్యూటీ కలెక్టర్లు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


జేసీ దంపతులను సన్మానిస్తున్న అధికారులు

పోలీసు సిబ్బందికి సన్మానం

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

సుదీర్ఘకాలం పాటు పోలీస్ శాఖకు సేవలు అందించడం అభినందనీయమని ఎస్‌పి తుషార్ డూడి కొనియాడారు. శనివారం ఉద్యోగ విమరణ చేసిన ఎఎస్ఐ ఆనంద్ బాబు, సీనియర్ అసిస్టెంట్ కిషోర్‌ను పూలమాలు, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎపి మాట్లాడుతూ సుదీర్గకాలంపాటు పోలీస్ శాఖకు విశేష సేవలు అందించి పదవీవిరమణ పొందడం అభి నందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేయిర్ ఆర్ఐ డి.శ్రీనివాసరెడ్డి , ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


పోలీసు సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్‌పి

పేదల సంక్షేమానికి కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

నిరుపేదలను ఎన్‌టిఆర్ భరోసా పింఛనుతో రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. బాపట్లలో లబ్ధిదారులకు ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు శనివారం పంపిణీ చేశారు. భీమావారిపాలెం వర్షంలోనే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు అందజేశారు. నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి భరోసా కల్పించారు. ఒకటవ తేదీ ఆదివారం సెలవు దినం రావడంతో సచివాలయం ఉద్యోగులంతా ముందు రోజే నగదు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ జిల్లా వ్యాప్తంగా సచివాలయాల సిబ్బంది పింఛను పంపిణీలో నిమగ్నమయ్యారన్నారు. ఈ ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ పిచ్చిరెడ్డి, బాపట్ల మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్, బాపట్ల మున్సిపల్ మాజీ చైర్మన్ జిట్టా ప్రమీలారాణి, జనసేన నాయకులు కారుమూరి ఆంజినేష్, బిజెపి నాయకులు మామిడి రమేష్, టిడిపి నాయకులు శీలం శ్రీనివాస రావు పాల్గొన్నారు.


బాపట్లలో పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్


ఒంగోలులో పింఛన్లు అందజేస్తున్న కలెక్టర్ అన్సారియా

బాపట్ల పట్టణంలోని రెండవ వార్డు, బాపట్ల మండలం ఈతేరు గ్రామంలో బాపట్ల ఎంపీ తెన్నేటి కష్ణ ప్రసాద్ ,బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్,ఆర్‌డిఒ రవీంద్ర , మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధన్ రెడ్డి, బాపట్ల పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు సలగల రాజశేఖర్ బాబు, ఇన్‌ఛార్జి తహాశీల్దారు శ్రీదేవి పాల్గొన్నారు.

90 శాతం పెన్షన్లు పంపిణీ

ఒంగోలు కలెక్టరేట్ : ఎన్‌టిఆర్ భరోసా పెన్షను పథకంలో భాగంగా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా ఎడతెరిపిలేని వర్షం కురుస్తున్నప్పటికీ అధికారులు పెన్షన్లు పంపిణీ చేశారు. ఒంగోలులోని ధారావారి పేట, సంతపేట, భాగ్యనగర్ 3వ లైన్ లో పెన్షన్ల కలెక్టర్ తమీమ్ అన్సారియా డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ వసుంధర, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు పింఛన్లు పంపిణీ చేశారు. ఆర్ భరోసా పెన్షన్ పథకంలో భాగంగా సామాజిక భద్రత పెన్షన్లను శనివారం 90 శాతానికి పైగా పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.


ఒంగోలులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే దామచర్ల

రాష్ట్రంలో లబ్ధిదారుల సంక్షేమం కోసం ఆలోచన చేస్తున్న కూటమి ప్రభుత్వం చరిత్రలో నిలుస్తుందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు తెలిపారు. వద్ధులు, ఒంటరి మహిళలు, వికలాంగులకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఒంగోలు నగరంలోని 21వ డివిజన్‌లో లబ్ధిదారులకుఎమ్మెల్యే దామచర్ల స్థానిక నేతలతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. జోరు వానలో సైతం ఇంటింటికి తిరిగి పింఛన్లు పంపిణీ చేయడం, లబ్ధిదారులతో మాట్లాడటం అందరినీ ఆకర్షించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 1న సెలవు కావడంతో ముందు రోజే పెన్షన్ల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళీ

- లోతట్లు ప్రాంతాల్లో పర్యటన

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. బాపట్ల పట్టణం శారదాపురికాలనీ, శాంతినగర్‌లో నీటి మునిగిన గహాలను ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, జిల్లా కలెక్టర్ వెంకట మురళి పరిశీలించారు. మున్సిపల్ క08ఙమిషనర్ నిర్మల్ కుమార్ ఆధ్వర్యంలో సిసిరోడ్డును మధ్యలో కట్ చేసి గృహాల్లోని వర్షపు నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఆర్‌డిఒ జి. రవీందర్, తదితరులు పాల్గొన్నారు.


బాపట్లలో లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

తుఫాను హెచ్చరిక నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికలు, భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ నిరంతరం కొనసాగుతుందన్నారు. అత్యవసర సమయంలో సహాయం కోసం కంట్రోల్ రూమ్ 8712655881 సెల్ నంబరును సంప్రదించాలన్నారు.


ఒంగోలులో లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

వరద నీటితో ప్రయాణించరాదు

బ్రిడ్జీలు, కల్వర్టుల పై వరద నీరు ప్రవహిస్తుంటే వాటిని దాటి వెళ్లే ప్రయత్నం చేయవద్దని ఎస్‌పి తుషార్ డూడి ప్రజలను విజ్ఞప్తి చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారిందని శనివారం అర్ధరాత్రి విశాఖపట్నం – గోపాల్పూర్ మధ్యలో కళింగపట్నం వద్ద తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. దానిని దష్టిలో పెట్టుకొని ఇతర శాఖల ప్రభుత్వ అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఇబ్బందులు ఎదురైనపుడు వారికి సహాయ సహకారాలు అందించడానికి ఎల్లవేళలా సంసిద్ధంగా ఉండాలని ఎస్‌పి పోలీస్ అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలలో నివాసం ఉండే వారు అప్రమత్తంగా ఉండాలన్నారు.

లోతట్టు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించండి

ఒంగోలు కలెక్టరేట్ : వర్షాల నేపథ్యంలో ఒంగోలు నగరంలోని లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఒంగోలు నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం పర్యటించారు. భారీ వర్షాల కారణంగా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చేపట్టిన కాలువల్లో పూడిక తీయటం, నీటిని తొలగించటాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అల్ప పీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో ఒంగోలు నగరంలో డ్రైనేజీలు ఉధతంగా ప్రవహిస్తున్నట్లు తెలిపారు.


ఒంగోలులోని ఓ కాలనీ ఇళ్లలోకి వర్షపు నీరు


పెద్దనాగులవరం చెరువు కట్టను పరిశీలిస్తున్న మార్కాపురం ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ వెంకట సునీల్

ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నూకసాని బాలాజీ, జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, ఒంగోలు మేయర్ సుజాత, కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, టిడిపి ఒంగోలు నగర అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావు, బండారు మదన్, టిడిపి నాయకులు, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులోకి వర్షపు నీరు

మార్కాపురం : తుఫాను ప్రభావంతో ఎడతెరపి లేని వాన కురుస్తోంది. దీంతో జన జీవనం స్తంభించింది. మండల పరిధిలోని పెద్దనాగులవరం చెరువుకు నీరు చేరుకుంటోంది. ఇప్పటి వరకు ఐదు అడుగుల లోతున నీరు చేరినట్లు తెలిసింది. చాలా కాలం తరువాత చెరువుకు నీరు చేరుతున్నందున చెరువు కట్ట దెబ్బతినే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రమాదంపై ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు జిల్లా కలెక్టరేట్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో అధికారులు స్పందించారు. మార్కాపురం ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ వెంకట సునీల్ సిబ్బందితో పెద్దనాగులవరం చెరువును సందర్శించారు. కట్టను పరిశీలించారు. నీటి ఉధృతి పెరిగిన తరువాత చెరువు కట్టకు ప్రమాదం లేకుండా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.